సాక్షి సూర్యాపేట

మంగళవారం । 3 । జూన్ । 2025



గురితప్పని లక్ష్యం

నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన క్రాంతి కుమార్ భారత ఆర్చరీ జట్టు కోచ్‌గా ఎంపికయ్యారు. - IIలో



చేపల చెరువులో విష ప్రయోగం

చిలుకూరు మండలం సీత్లాతండా గ్రామ చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. - IIలో

గరిష్ఠం/కనిష్ఠం
39°/27°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నరసింహారావు

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ట్రాన్స్‌జెండర్లు, మహిళలు స్వయం ఉపాధి పొందాలని జిల్లా సంక్షేమాధికారి నరసింహారావు కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ట్రాన్స్‌జెండర్లు, మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా టాన్స్‌జెండర్ల కోసం కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ కుట్టుశిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ రూప, మిషన్ శక్తి కోఆర్డినేటర్ చైతన్య, ఫైనాన్స్ లిట్రసీ తేజస్విని, రేవతి, ఇరిగి కోటేశ్వరి, వినోద్, క్రాంతి, ట్రైనర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో చీడపీడల నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

నేరేడుచర్ల : వరిలో సమగ్ర సస్య రక్షణ చర్యలను చేపడితేనే చీడల పీడలను నివారించవచ్చని భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి సూచించారు. సోమవారం నేరుడుచర్లలోని రైతు వేదికలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి పైరును ఆశించే దోమ, కాండం తొలుచు పురుగు, ఆకుముడత. ఉల్లికోడు, కంకి నల్లి, అగ్గితెగులు, ఎండాకు తెగులు, పొట్టకుళ్లకు యాజమాన్య పద్ధతులను వివరించారు. రైస్ క్లినిక్ యాప్‌పై అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేయడం ద్వారా దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సీనియర్ సైంటిస్ట్ డి. నరేష్, వ్యవసాయ శాఖ అధికారి జావిద్, వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేషి, శరత్ పాల్గొన్నారు.

నేరాలు, హింసకు వ్యతిరేకంగా పోరాటం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చింతపల్లి వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్ : నేరాలు, హింస, అవినీతికి వ్యతిరేకంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) పనిచేస్తుందని ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీచింతపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని కాంప్లెక్స్ లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఎన్‌హెచ్ఆర్‌సీ పనిచేస్తుందన్నారు. ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందో అక్కడ ఎన్‌హెచ్ఆర్‌సీ ఉంటుందన్నారు. ఇది చట్టానికి లోబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా చైర్మన్ బండ్ల రమేష్, వైస్ చైర్మన్ నవిలె నాగయ్య, సూర్యాపేట కన్వీనర్ సారగండ్ల సైదులు, మహిళా పోర్ట్ చైర్మన్ మాదాన స్వప్న, జనరల్ సెక్రటరీ బర్పటి సునీత పాల్గొన్నారు.

10 నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

మునగాల: ఈనెల 10,11,12 తేదీల్లో హుజూర్ నగర్ పట్టణంలో సీపీఎం సూర్యాపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి వెల్లడించారు. సోమవారం మునగాల మండలం కొక్కిరేణిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ ,కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం, వీరబోయిన రవి, వట్టెపు సైదులు, షేక్ సైదా, బచ్చలకూరి స్వరాజ్యం, కొప్పుల రజిత ,మిట్టగణుపుల ముత్యాలు, కొదమగుండ్ల నగేష్, దుగ్గి బ్రహ్మం, జూలకంటి విజయలక్ష్మి, మేకనబోయిన శేఖర్ పాల్గొన్నారు.

త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్రం



తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం సెల్యూట్ చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



> ఎందరో అమరుల త్యాగాల పునాదులపై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములై అమరులైనవారిని నేడు గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వీరి స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పయనింపజేసేందుకు బృహత్తర ప్రణాళికలు రూపొందించుకున్నాం.
>
> – మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పారదర్శక పాలనే లక్ష్యం

- అభివృద్ధికి బృహత్తర ప్రణాళికలు
- ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం
- జిల్లాను సస్యశ్యామలం చేస్తా
- తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర నీటిపారుదల , పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి .. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివరించిన జిల్లా ప్రగతి ఆయన మాటల్లోనే..రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ – 2047 విజన్‌తో ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ విజన్ డాక్యుమెంట్ భగవద్గీతగా పనిచేసి రాష్ట్రం రూపురేఖలే మార్చేస్తుంది. సూర్యాపేట జిల్లా ప్రజలు ఎంతో చైతన్యం ఉన్నవారు. పారదర్శక పాలన లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. ఇరిగేషన్ పనులు, పెండింగ్ పథకాలను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం.

ఇప్పటికే 150 బస్సులు కొనుగోలు

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఇందులోభాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పాటు మహిళలతో విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటు చేయించాం. పెట్రోల్ బంకుల నిర్వహణ, మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించాం . ఇప్పటికే 150 బస్సులను కొనుగోలు చేసి ఇచ్చాం. మహాలక్ష్మి పథకం కింద జిల్లా వ్యాప్తంగా 2.85కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణాన్ని కల్పించి రూ.153.80 కోట్లు ఆదా చేశాం.

యాసంగిలో రైతుభరోసా కింద రూ.227.44కోట్లు జమ

జిల్లాలో 2,44,423 మంది రైతులకు రైతు భరోసా కింద గత యాసంగి సీజన్‌లో రూ.227.44 కోట్లు జమ చేశాం. నాలుగు దశల్లో 1,27,269 మంది రైతులకు రూ.1,005 కోట్లతో పంటల రుణమాఫీ చేశాం. 2024 – 25 యాసంగిలో 7,128 మంది రైతుల వద్ద 50,348 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి రూ.25.17 కోట్ల బోనస్ చెల్లించాం. భూభారతి చట్టాన్ని తీసుకొచ్చి గరిడేపల్లి మండలంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయడంతో 1,690 దరఖాస్తులు రాగా విచారణ పూర్తి.

18,766 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తాం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ చేస్తాం. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 18,766 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు ఇస్తాం. కొత్తగా 9,529 రేషన్ కార్డులను జారీచేశాం. 45,701 నూతన సభ్యులను రేషన్ కార్డుల్లో చేర్చాం. జిల్లాలో పెండింగ్, నూతన ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యమిస్తున్నాం. ఎస్సారెస్పీ రెండో దశలోని డీబీఎం 71లో 22 ఎల్, 36 ఎల్ మైనర్ కాలువల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు మోతె మండలం అన్నారి గూడెం వద్ద పాలేరు రిజర్వాయర్ పై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను నిర్మించేందుకు రూ.244 కోట్లు మంజూరు కాగా పనులు టెండర్ దశలో ఉన్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ లైనింగ్ పనులకు రూ.29.2 కోట్లు, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.184.60 కోట్లు, జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.52.11 కోట్లు మంజూరు చేశాం. జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకానికి రూ.173 కోట్లు, ఆర్–9ఎత్తిపోతల పథకానికి రూ.8.45 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఆర్‌డీఓ వివి అప్పారావు, జిల్లా అధికారులు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి ప్రైవేట్ రంగంలోనూ లక్ష ఉద్యోగాలు సృష్టించాం. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి జిల్లాలోని గరిడేపల్లి, చిలుకూరు, తిరుమలగిరి మండలాల్లో రూ.200 కోట్ల చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశాం.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను మంత్రి సన్మానించారు. మెప్మా ఆధ్వర్యంలో 169 స్వయం సహాయక సంఘాలకు రూ.27.73 కోట్లు, డీఆర్‌డీఏ ద్వారా రూ.54 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ముప్పని ప్రవీణ్‌రెడ్డి, చేరిపల్లి మార్కండేయ, చేగూరి గీత, చైతన్య, నందిని, అక్షయలకు మంత్రి ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం స్టాళ్లను పరిశీలించడంతో పాటు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట మండలానికి చెందిన 10మంది గౌడసంఘం సభ్యులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు.



కానరాని వార్డు అధికారులు

- క్షేత్రస్థాయి పర్యవేక్షణ కరువు
- కార్యాలయాలకు పరిమితమవుతున్న అధికారులు



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం

సూర్యాపేట అర్బన్ : మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరుస్తూ అభివృద్ధి పనులను సులభతరం చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా ప్రతి వార్డుకు ఒక అధికారిని కేటాయించారు. అయితే వార్డు అధికారులు సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలో కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫీల్డ్ మీదకు రాకుండా కార్యాలయాలకు పరిమితమవుతున్నారని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

మున్సిపాలిటీ	వార్డు ఆఫీసర్లు
సూర్యాపేట	48
కోదాడ	35
హుజూర్‌నగర్	28
తిరుమలగిరి	15
నేరేడుచర్ల	15

పనులన్నీ అస్తవ్యస్తం

వార్డు అధికారులు నిరంతరం పారిశుద్ధ్య కార్మికులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య ప్రణాళిక అమలు చేయడం, ఇంటింటికి చెత్త సేకరణ నిర్వహణ పక్కాగా ఉండేలా చూడాలి. అంటువ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం సూచించిన సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నివారణ కట్టుదిట్టంగా అమలయ్యేలా చూడాల్సి ఉంటుంది. అదేవిధంగా నర్సరీల మొక్కల పెంపకం, వీధి దీపాలు, నీటి సరఫరా, ఆసరా పింఛన్లు ఇతర అభివృద్ధి పథకాల అమలు, ఆస్తి పన్ను వసూలు, అసెస్మెంట్ కానివి పురోగతిలో ఉన్న వాటి వివరాలు ఎప్పటికప్పుడు రూపొందించాల్సి ఉంటుంది. అయితే వార్డు పరిధిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. కొన్ని కాలనీల్లో కుక్కలు, కోతుల బెడదతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు అడ్డుకట్ట పడాలన్నా, మున్సిపాలిటీకి ఆదాయం సక్రమంగా సమకూరాలన్నా వార్డు అధికారులు పనితీరే అత్యంత కీలకం. ఇటు అధికారులకు అటు వార్డు ప్రజలకు అనుసంధానంగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ వార్డులను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తీసుకోవడంలో వార్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మున్సిపాలిటీ ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం కార్యాలయాలకు పరిమితమవుతూ తమకు కేటాయించిన విధులపై అంతగా దృష్టి సారించకపోవడంతో పట్టణవాసులు అసహనానికి గురవుతున్నారు.

ప్రవేశాల వేళ.. సర్దుబాటా?

విద్యాశాఖ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

- ఈ నెలాఖరు వరకు వాయిదా వేయాలని డిమాండ్
- 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులన్న నిబంధన సరికాదు



నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని, ఇది జూన్ 13వ తేదీ లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ ఏడాది ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ సమయంలో సర్దుబాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కోల్పోతామని చెబుతున్నారు. తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని, కనీసం జూన్ 30 వరకు వచ్చిన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఇవీ నిబంధనలు..

మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేసుకోవచ్చు. వీటితో పాటు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలనే నిబంధనలున్నాయి. పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వొద్దు. ఈ ప్రక్రియలో గత యూడైస్ వివరాలను ప్రతిపాదికగా తీసుకోనున్నారు. 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 60లోపు ఇద్దరు, 90లోపు ముగ్గురు, 120లోపు నలుగురు, 150వరకు ఐదుగురు, 200లోపు విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులుండాలని, 200 దాటిన తర్వాత ప్రతి 40మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సర్దుబాటు ప్రక్రియ వాయిదా వేయాలి



ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులు జూన్‌నెలాఖరు వరకు వాయిదా వేయాలి. వేసవి సెలవుల్లో జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాం. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జూన్ 18 వరకు బడిబాటలో నూతన ప్రవేశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నాం. జూన్ చివరి వరకు ఎన్‌రోల్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని సర్దుబాటు ప్రక్రియ చేపడితే ఫలితం ఉంటుంది.

– తంగెళ్ల జితేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయుల వాదన ఇలా..

విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారు. ఇది ఆచరణలో అసాధ్యమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను ఇద్దరు ఎలా బోధిస్తారని, విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ఉపాధ్యాయవర్గాలు వాదిస్తున్నాయి. బోధనతో పాటు అనేక రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, వాటికే ఒకరు సరిపోతున్నారని చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో పదోన్నతులు, బదిలీలు, నూతన డీఎస్సీతో పాటు 2008 అభ్యర్థులను తాత్కాలిక ప్రాతిపదికన తీసుకోవడంతో సర్దుబాటు ఆవశ్యకత అంతగా లేకపోవచ్చనే వాదన ఉంది.

ప్రవేశాలు పెంచేందుకు కసరత్తు

ఈ ఏడాది బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. తమ కృషితో ప్రవేశాలు చాల వరకు పెరుగుతాయని ఆశాభావంతో ఉన్నారు. పలు గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు బడులకు పంపబోమని తీర్మానాలు సైతం చేయించారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామాచర్చనలు,అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ , తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు.అదేవిదంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసా చార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణ చార్యులు, ఫణిభూషణ మంగా చార్యులు, మార్తి దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు , వంశీకృష్ణమా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, చీకూరి రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : సింగపూర్ యూనివర్సిటీలో జూలై నెలలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) వాణిజ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి ఎంపికయ్యారు. ఈ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. సదస్సుకు వెళ్లనున్న వెంకటరమణారెడ్డికి సోమవారం వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ ఆహ్వాన పత్రం అందజేసి అభినందించారు.



వీసీ నుంచి పరిశోధన ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న మారం వెంకటరమణారెడ్డి

మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



విద్యుత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్

సూర్యాపేట : విద్యుత్ సిబ్బంది మెరుగైన సేవలందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. సూర్యాపేట పట్టణంలో రూ.7.61 కోట్లతో నిర్మించిన సమీకృత జిల్లా విద్యుత్ కార్యాలయాన్ని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, టీజీఎస్ఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌లతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో పంటలు ఎక్కువ సాగవుతున్నందున రైతులకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా చేయాలన్నారు. వర్షాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎస్ఈ ఫ్రాంక్లిన్‌ను కుర్చీలో మంత్రి కూర్చోబెట్టి రైతుల పట్ల మంచిగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డీఓ వేణు మాధవ్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణయ్య, ఏఈ శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలించిన ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలో చోరీ జరిగిన ఎస్‌బీఐ ఏటీఎంను సోమవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దొంగతనం జరిగిన తీరు, కేసు దర్యాప్తు వివరాలను సీఐ చరమంద రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలోకి సీసీ కెమెరాలు పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలని పోలీసులకు సూచించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి ఏటీఎంలు, బ్యాంకుల వద్ద సెక్యూరిటీని, సీసీ కెమెరాలను బలోపేతం చేసుకోవాలని సూచించినట్లు గుర్తుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నార్కట్‌పల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామానికి చెందిన చెరుకు మహేష్(24) ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లిలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని చైతన్య ఆస్పత్రి ఎదుట మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో మహేష్ పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

మోత్కూరు: ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం కమ్మగూడేనికి చెందిన తిప్పబత్తిని రాజయ్య(63) సోమవారం పాటిమట్ల గ్రామంలోని స్కూల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. మోత్కూరు నుంచి వస్తున్న ఆటో పల్టీ కొట్టి రాజయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చెన్నాయిపాలెం విద్యార్థికి 238వ ర్యాంకు


భూక్యా కోటేష్

మఠంపల్లి: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన భూక్యా రవీందర్, సీతమ్మ దంపతుల కుమారుడు కోటేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 238వ ర్యాంకు సాధించాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన కోటేష్ అత్యుత్తమ ర్యాంకు సాధించడంతో గ్రామ పెద్దలు అభినందించారు.


నల్లగొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రదర్శించిన గృహ నిర్మాణ శాఖ శకటం


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి


నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండలో వ్యవసాయ శాఖ స్టాల్‌లో రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు


నల్లగొండలో రవాణా శాఖ శకటం ముందు పరేడ్ నిర్వహిస్తున్న ఆ శాఖ అధికారులు


సూర్యాపేటలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న శాసనమండలి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


సూర్యాపేట కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సూర్యాపేటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గురితప్పని లక్ష్యం

- భారత ఆర్చరీ జట్టు కోచ్‌గా పుట్టపాక వాసి క్రాంతికుమార్
- చిన్నప్పుడే అతడిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన దేప విప్లవరెడ్డి, రాజ్యం దంపతుల కుమారుడు క్రాంతికుమార్ భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. చిన్నప్పుడే క్రాంతికుమార్‌లోని ప్రతిభను గుర్తించిన అతడి తల్లిదండ్రులు 4వ తరగతిలోనే హైదరాబాద్‌లోని హకీంపేటలో గల తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. అక్కడ పనిచేస్తున్న ఆర్చరీ కోచ్ డాక్టర్ రవిశేఖర్ ప్రోత్సాహంతో క్రాంతికుమార్ ఆర్చరీ క్రీడలో పట్టు సాధించారు. అక్కడే బీఏ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పీజీ పూర్తిచేశారు. ఆ తర్వాత కలకత్తాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఆర్చరీ కోచ్‌గా డిప్లొమా పూర్తిచేశారు. 2024లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఆర్చరీ కోచ్‌గా ఉద్యోగం రావడంతో హర్యానాలోని సోనిపట్ల ప్రాంతంలో కోచ్‌గా ఉద్యోగంలో చేరారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ ఆర్చరీ జట్టు కోచ్ ఎంపికలో పాల్గొని ఈ నెల 15 నుంచి 20 వరకు సింగపూర్‌లో జరిగే ఆసియా కప్‌లో భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. క్రాంతికుమార్‌కు ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్, కోశాధికారి సత్యప్రసాద్, నల్ల గొండ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తునిక విజయసాగర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కామినేని, మాజీ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి, కోశాధికారి పుట్ట శంకరయ్య అభినందనలు తెలిపారు.


హర్యానాలో క్రీడాకారుడికి శిక్షణ ఇస్తున్న క్రాంతికుమార్

నిరంతరం ప్రోత్సహించారు

నాలోని ప్రతిభను చిన్నప్పుడే నా తల్లిదండ్రులు గుర్తించి స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. నా గురువు డాక్టర్ రవిశేఖర్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. రవిశేఖర్ సార్, నా తల్లిదండ్రుల ప్రోత్సాహమే నేను జాతీయ జట్టు కోచ్‌గా ఎంపికవ్వడానికి దోహదపడింది. భారత్ జట్టు విజయం సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతా.

– దేప క్రాంతికుమార్

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి పెంచుకోవచ్చు

హుజూర్‌నగర్: నాణ్యమైన విత్తనాలు వాడటం వల్ల దిగుబడిని పెంచుకోవచ్చని ఏరువాక కేంద్రం నల్లగొండ జిల్లా శాస్త్రవేత్త రాజా మధుశేఖర్ అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్‌పర్సన్ రాధికాఅరుణ్‌కుమార్ అధ్యక్షతన 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజా మధుశేఖర్ పాల్గొని మాట్లాడుతూ.. విత్తనాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాలు వాడితే పది నుంచి పదిహేను శాతం దిగుబడులు పెంచుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ స్వర్ణ, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ పాల్గొన్నారు.


విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

షిర్డీ వెళ్లొస్తూ మృత్యు ఒడిలోకి..

- కారులో మంటలు చెలరేగడంతో సజీవ దహనమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు


సురేష్ (ఫైల్)

నల్లగొండ, మాడ్గులపల్లి: షిర్డీ వెళ్లి తిరిగి వస్తుండగా కారులో మంటలు చెలరేగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సజీవ దహనమయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఏచూరి గార్డెన్స్ సమీపంలో నివాసముంటున్న పెంటపల్లి సురేష్‌కుమార్ (48) తన స్నేహితుడితో కలిసి కారులో షిర్డీకి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా వద్దకు రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్‌తో పాటు సురేష్‌కుమార్ స్నేహితుడు క్షేమంగా బయటపడగా.. సురేష్‌కుమార్ మాత్రం మంటల్లో కాలి సజీవ దహనమయ్యాడు. సురేష్‌కుమార్ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతడి భార్య జ్యోతి వైద్యశాఖలో ఎక్స్‌రే టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరు ఇద్దరు డాక్టర్లే కాగా.. కుమార్తె వివాహం అయ్యింది. సురేష్ నల్లగొండలో ఉంటుండగా.. జ్యోతి తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. సురేష్ అంత్యక్రియలు సోమవారం నల్లగొండలో నిర్వహించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

- కుమారుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు


జీవన్ (ఫైల్)

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములర్తి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొండారెడ్డిచెరువు గ్రామానికి చెందిన కర్రె కనకయ్య (33), కుమారుడు కర్రె జీవన్ (13) ఇద్దరూ వ్యాపారం నిమిత్తం కూరగాయలు కొనుగోలు చేసేందుకు బైక్‌పై ములుగు మండలంలోని వంటిమామిడి మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తుండగా మండలంలోని పాములపర్తి గ్రామ శివారులో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జీవన్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కనకయ్యను మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


హైదరాబాద్‌లో సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రాంచంద్రనాయక్, బండా నరేందర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు. హరీష్‌రావు బర్త్ డే మంగళవారం కాగా.. నాయకులు ఆయనకు ముందస్తుగానే పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన జి. తేజశ్రీ 1505వ ర్యాంకు, సీహెచ్. హస్విత శ్రీ 2040, జె. మేఘన 2146, టి. అమూల్య 4877, బి.లాస్య 5766, డి. జగదీష్‌రాజు 8076 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా కేటగిరీల్లో 13 మంది విద్యార్థులు ఐఐటీలతో పాటు జాతీయ స్థాయి కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.


జి. తేజశ్రీ


సీహెచ్. హస్వితశ్రీ


జె. మేఘన


టి.అమూల్య


బి.లాస్య


డి.జగదీష్‌రాజు

సత్తా చాటిన సర్వేల్ గురుకుల విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు. ఎస్సీ విభాగంలో కొంగరి నిరంజన్ 1668వ ర్యాంకు సాధించాడు. ఆదేవిధంగా తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో పి. లోకేశ్వర్ 2604వ ర్యాంకు సాధించాడు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో బి. అభినంద్‌రెడ్డి, జి. హర్షిత్‌గుప్తా, ఎస్. సుమిత్, కె. బాలు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సతీష్‌కుమార్ అభినందించారు.


కొంగరి నిరంజన్

'ప్రగతి' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

నల్లగొండ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళా శాల విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన రమావత్ కృష్ణ 480వ ర్యాంకు, ధనావత్ చరణ్ 1569, దోమలపల్లి చరణ్ 2960, కల్లేపల్లి సమీరా 4122 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు నరేంద్రబాబు, శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందించారు.


రమావత్ కృష్ణ


ధనావత్ చరణ్


దోమలపల్లి చరణ్


కల్లేపల్లి సమీరా

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ


ఉత్తర మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ముఖమండపం క్యూలైన్, క్యూకాంప్లెక్స్, మాడ వీధులు, ధర్మదర్శనం క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. ధర్మదర్శనానికి 3 గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. 35వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రూ.43,72,183 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- సుమారు 5 టన్నుల చేపలు మృతి
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

చిలుకూరు: గుర్తుతెలియని వ్యక్తులు చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం చిలుకూరు మండలం సీత్లాతండా గ్రామంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీత్లాతండా గ్రామానికి చెందిన బానోతు కృష్ణ మూడేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో తన సొంత పొలంలో 25 గుంటల భూమిలో చేపల చెరువు తవ్వించాడు. ప్రస్తుతం ఆ చెరువులో చేపల పెంపకం చేపట్టాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. సోమవారం ఉదయం కృష్ణ చెరువు వద్దకు వెళ్లగా చేపలు మృతిచెంది నీటిపై తేలియాడటం గమనించాడు. ఒక్కో చేప రెండు కిలోల పైనే ఉంటుందని, సుమారు 5 టన్నుల చేపలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. చెరువు ఏర్పాటుకు, చేపల పెంపకం కోసం చాలా డబ్బులు ఖర్చు చేశానని, తనను కావాలనే ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఈ పనిచేశారని వాపోయాడు. ఈ ఘటనపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు కృష్ణ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్‌గా పోటీచేశాడు.